రాష్ట్ర స్థాయి ఆర్చరీ క్రీడలు ప్రారంభం | నెల్లికుదురులో 68వ ఎస్‌జీఎఫ్ క్రీడలు

నెల్లికుదురు, నవంబర్ 4: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆర్చరీ(విలువిద్య), ఫెన్సింగ్(కత్తిసాము) రాష్ట్ర స్థాయి 68వ ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి 10 జిల్లాల నుంచి 600 మంది ప్లేయర్లు పోటీపడుతున్నారు. 14, 17, 19 వయస్సు విభాగంలో బాలబాలికలకు విలువిద్య, కత్తిసాము క్రీడలు 2 రోజుల పాటు జరుగనున్నాయి. ఈ క్రీడలకు రాష్ట్ర పరిశీలకులుగా కడారి రవి వ్యవహరిస్తున్నారు. విలు విద్య క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు గుజరాత్ రాష్ట్రంలోని నడియాడులో, కత్తిసాములో మెరుగైన ప్రదర్శన కనబరిచిన ప్లేయర్లు పాట్నాలో జరిగే జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొంటారు. ఎంఈవో ఏ రాందాస్, హెచ్ ఎంలు రవి, జీవన్ కుమార్, పీడీలు ఐలయ్య, ప్రవీణ్, సునీత, మధుకర్, టెక్నికల్ పర్సన్లు హరికృష్ణ, శ్రీనివాస్, పుల్లయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సత్యనారాయణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

స్పిన్ పిచ్‌లే ముంచాయా?

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

స్వదేశంలో తిరుగులేని శక్తిగా ఉన్న భారత క్రికెట్ జట్టును న్యూజిలాండ్ టెస్టు సిరీస్ ఒక్కసారిగా హిమాలయాల నుంచి పాతాళానికి పడేసింది. ఇన్నాళ్లుగా ఏ స్పిన్ పిచ్‌లను మన బలమని చెప్పుకున్నామో ఈ సిరీస్‌లో అవే మనల్ని నిండా ముంచాయా? అంటే సమాధానం ఔననే చెప్పక తప్పదు. ప్రపంచ చాంపియన్లం అని విర్రవీగిన కంగారూల మెడలు వంచి, 'బజ్‌బాల్' ఆట అంటూ ఊదరగొట్టిన ఇంగ్లండ్‌కూ చుక్కలు చూపించి అలవోకగా సిరీస్‌లను కొల్లగొట్టిన టీమ్‌ఇండియా.. ఇప్పుడదే పిచ్‌లపై కివీస్ చేతిలో చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో పరాభవాన్ని ఎదుర్కొంది. సొంతగడ్డపై అనుకూలించే పరిస్థితులు, స్పిన్‌ను ఆడటంలో సుదీర్ఘ అనుభవం, ప్రత్యర్థి స్పిన్నర్లపై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించే భారత బ్యాటర్లు కివీస్‌తో సిరీస్‌లో స్పిన్‌ను ఆడలేక చతికిలపడ్డ తీరు గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. అంతర్జాతీయంగా విమర్శలు వస్తున్నప్పటికీ ప్రత్యర్థులను స్పిన్ ఉచ్చులో బంధించి ఆపై బ్యాటర్లు భారీ ఇన్నింగ్స్‌లతో కొండంత స్కోర్లు చేసి విదేశీ జట్లను చుట్టేయడం భారత్‌కు ఆనవాయితీ. కానీ కివీస్‌తో సిరీస్‌లో ఈ వ్యూహం బెడిసికొట్టింది. ఈ ఏడాది భారత పర్యటనలో ఏకంగా ఐదుగురు స్పిన్నర్లను జట్టులో చేర్చిన ఇంగ్లండ్ బౌలింగ్‌లో భారత బ్యాటర్ల సగటు దాదాపు 40 (39.8)గా నమోదైంది. యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ వంటి ఆటగాళ్లు ఇంగ్లీష్ స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. బంగ్లాదేశ్ సిరీస్‌లోనూ భారత బ్యాటర్ల సగటు 42.9గా ఉంది. కానీ అదే కివీస్ స్పిన్నర్లను ఎదుర్కొనే క్రమంలో అది 24.4కు పడిపోయింది. మొత్తంగా ఈ సిరీస్‌లో మన బ్యాటర్ల సగటు 21.55గా నమోదైందంటే 'టర్నింగ్ ట్రాక్స్'పై మన బ్యాటర్ల వైఫల్యం ఎంత దారుణంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు.

'పట్టు' దొరికిందా!

భారత బ్యాటర్లు క్రీజులో నిలబడటానికే తంటాలుపడ్డ పిచ్‌లపై కివీస్ అంచనాలకు మించి రాణించింది. అశ్విన్, జడేజా వంటి మేటి స్పిన్నర్లున్నప్పటికీ ఆ జట్టులో డారెల్ మిచెల్, విల్ యంగ్, రచిన్ రవీంద్ర స్పిన్‌ను దీటుగా ఎదుర్కొన్నారు. పుణె టెస్టులో రోహిత్ సేనను శాంట్నర్ తన స్పిన్‌తో ముప్పుతిప్పలు పెడితే స్టార్ భారత స్పిన్ మాంత్రికుడు అశ్విన్ మాత్రం తేలిపోయాడు. ఇంగ్లండ్ సిరీస్‌లో ఆ జట్టు స్పిన్నర్లంతా 60 వికెట్లు (షోయబ్ బషీర్ 17, రిహాన్ అహ్మద్ 11, టామ్ హార్ట్లీ 22, జో రూట్ 8, జాక్ లీచ్ 2) తీశారు. తాజాగా కివీస్ సిరీస్ గెలవడంలో ఆ జట్టు స్పిన్నర్లదే కీలకపాత్ర. ఒకే టెస్టు ఆడిన శాంట్నర్ 13 వికెట్లు తీయగా అజాజ్ పటేల్ 11, ఫిలిప్స్ 7 వికెట్లు పడగొట్టారు. మూడు టెస్టులలో కివీస్ స్పిన్నర్లు 37 వికెట్లు పడగొట్టడం విశేషం. స్వదేశాన భారత స్పిన్నర్ల ఆధిపత్యం తగ్గడమే గాక విదేశీ స్పిన్నర్లు పట్టు దక్కించుకున్నారనడానికి ఇదే నిదర్శనం. ఈ నేపథ్యంలో బీసీసీఐ ఇకనైనా స్పిన్ ట్రాక్‌లకు వీడ్కోలు పలికి బ్యాట్‌కు, బంతికి సమంగా పోరు జరిగేలా పిచ్‌లను రూపొందించాలనే డిమాండ్ వినబడుతోంది. ముంబై టెస్టు ముగిశాక మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

పతనానికి పరాకాష్ఠ

బెంగళూరు టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో మినహా మిగిలిన ఐదు ఇన్నింగ్స్‌లలోనూ మన బ్యాటర్ల దృష్టి అంతా క్రీజులో నిలబడి పరుగులు సాధించడం మీద కాకుండా ఎప్పుడెప్పుడు పెవిలియన్‌కు వెళ్లిపోదామా? అన్నట్టుగా సాగింది. ఆరు ఇన్నింగ్స్‌లలో 'మెన్ ఇన్ బ్లూ' పతనాలే ఇందుకు తార్కాణం. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే ఆలౌట్ అయిన మన వీరులు.. సాఫీగా సాగుతున్న రెండో ఇన్నింగ్స్‌లో చివరి ఏడు వికెట్లను 54 పరుగులకే కోల్పోయారు. ఒకదశలో 408/3 పటిష్ఠ స్థితి నుంచి 462 పరుగులకు ఆలౌట్ అయ్యారు. పుణె టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆఖరి ఆరుగురు చేసిన రన్స్ 53 కాగా సెకండ్ ఇన్నింగ్స్‌లో 50కే ఐదు వికెట్లు నేలకూలాయి. ముంబై టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆరుగురు బ్యాటర్లు 83 రన్స్‌కే వెనుదిరగగా రెండో ఇన్నింగ్స్‌లో 16 పరుగులకే ఐదుగురు టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఇలా కొట్టిన పిండిల్లాంటి స్వదేశీ పిచ్‌లపై మన బ్యాటర్లు బొక్కాబోర్లా పడటం అభిమానుల ఆగ్రహాన్ని మరింత రెట్టింపు చేస్తున్నాయి.

క్రికెట్‌కు సాహా వీడ్కోలు

కోల్‌కతా: భారత వెటరన్ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్ తరపున 40 టెస్టులు ఆడిన సాహా.. ఈ ఏడాది రంజీ సీజన్ తనకు ఆఖరిదని 'ఎక్స్' వేదికగా ప్రకటించాడు. 'అద్భుత క్రికెట్ ప్రయాణం ముగింపు దశకు చేరుకుంది. ఈ రంజీ సీజనే నాకు చివరిది. బెంగాల్ తరపున చివరి సారి ప్రాతినిధ్యం వహిస్తుండటం సంతోషంగా ఉంది. ఈ సీజన్‌ను జీవితాంతం గుర్తుండిపోయేలా చేసుకుంటా' అని ఎక్స్‌లో రాసుకొచ్చాడు.

షమీ రాక ఆలస్యం

బెంగళూరు: భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పూర్తి స్థాయి క్రికెట్ ఆడేందుకు మరింత సమయం పట్టే అవకాశముంది. కీలకమైన ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌కు ముందు దేశవాళీ రంజీ టోర్నీ ద్వారా సన్నద్ధం కావాలనుకున్న షమీ ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. బుధవారం నుంచి చిన్నస్వామి స్టేడియం వేదికగా కర్ణాటకతో జరిగే మ్యాచ్‌తో పాటు మధ్యప్రదేశ్ పోరుకు ఎంపిక చేసిన బెంగాల్ జట్టులో షమీకి చోటు దక్కలేదు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టు సందర్భంగా నెట్స్‌లో ప్రాక్టీస్ చేసిన షమీ తాను 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉన్నానని ప్రకటించిన సంగతి తెలిసిందే.

రోహిత్ లేకపోతే.. బుమ్రానే కెప్టెన్: గవాస్కర్

న్యూఢిల్లీ: రెగ్యులర్ కెప్టెన్ రోహిత్‌శర్మ అందుబాటులో లేకపోతే ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌కు బుమ్రాను కెప్టెన్‌గా ఎంపిక చేయాలని క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ పేర్కొన్నాడు. ఈనెల 22 నుంచి ఆసీస్‌తో టెస్టు సిరీస్ మొదలవుతున్న నేపథ్యంలో సన్నీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రోహిత్ భార్య రెండో బిడ్డకు జన్మనివ్వనుందన్న వార్తల క్రమంలో తొలి రెండు టెస్టులకు దూరమయ్యే చాన్స్ ఉంది.

ఈసారి రియాద్‌లో?

నవంబర్ నెలాఖరున ఐపీఎల్ వేలం!

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 వేలాన్ని గతేడాది దుబాయ్‌లో అట్టహాసంగా నిర్వహించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ ఏడాది జరగాల్సి ఉన్న మెగా ఆక్షన్‌ను మరోసారి అరబ్బుల అడ్డాలోనే జరిపించేందుకు ముహూర్తం ఖరారు చేసినట్టు సమాచారం. ఐపీఎల్-2025 వేలాన్ని సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నిర్వహించనున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. మెగా వేలానికి సంబంధించి తేదీలపై బీసీసీఐ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయకపోయినప్పటికీ నవంబర్ 24, 25 తేదీలలో ఆక్షన్‌ను నిర్వహిస్తామని అన్ని ఫ్రాంచైజీలకు బీసీసీఐ ఇదివరకే సమాచారం అందించినట్టు తెలుస్తోంది. రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ వంటి స్టార్ క్రికెటర్లు ఈసారి వేలంలోకి వస్తుండటంతో వేలం ప్రక్రియపై ఆసక్తి మరింత పెరిగింది. ఇటీవలే పది ఫ్రాంచైజీలు వచ్చే సీజన్‌లో తాము అట్టిపెట్టుకోబోయే ఆటగాళ్ల జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. రిటెన్షన్‌లో ఫ్రాంచైజీలు 46 మంది ఆటగాళ్లకు రూ. 558.5 కోట్లు ఖర్చు చేశాయి. 204 స్లాట్స్ అందుబాటులో ఉన్న వేలంలో రిటెన్షన్‌కు పోగా మరో రూ. 641.5 కోట్ల నగదు ఫ్రాంచైజీల వద్ద ఉంది. వేలంలో ఏ ఆటగాడు ఎంత దక్కించుకుంటానే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే సరిగ్గా వేలం జరిగే సమయానికే భారత క్రికెట్ జట్టు ఆసీస్ టూర్‌లో తొలి టెస్టు (నవంబర్ 22 నుంచి ప్రారంభం) ఆడనున్న నేపథ్యంలో ప్రసారాల్లో ఇబ్బందులు తలెత్తకుండా మధ్యాహ్నం సమయంలో వేలం నిర్వహించనున్నట్టు సమాచారం.

తొలి వన్డేలో ఆసీస్ గెలుపు

- కమిన్స్ ఆల్‌రౌండ్ షో

మెల్‌బోర్న్: సొంతగడ్డపై పాకిస్థాన్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. మెల్‌బోర్న్ వేదికగా ఉత్కంఠగా జరిగిన మొదటి వన్డేలో ఆసీస్ 2 వికెట్ల తేడాతో గెలిచింది. కెప్టెన్ కమిన్స్ బంతి (2/39)తో పాటు బ్యాట్ (32 నాటౌట్)తోనూ రాణించి కంగారూల విజయంలో కీలకపాత్ర పోషించాడు. మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్‌ను స్టార్క్ (3/33), కమిన్స్, జంపా (2/64) కట్టడి చేయడంతో ఆ జట్టు 46.4 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌట్ అయింది. కొత్త కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ (44) ఫర్వాలేదనిపించాడు. అనంతరం ఛేదనలో స్టీవ్ స్మిత్ (44), జోష్ ఇంగ్లిస్ (49) రాణించడంతో ఆసీస్ ఒక దశలో 138/3తో పటిష్టంగానే ఉంది. కానీ హారీస్ రౌఫ్ (3/67) మిడిలార్డర్‌ను దెబ్బకొట్టడంతో కష్టాల్లో పడింది. అయితే కమిన్స్ పాక్ బౌలర్లకు ఎదురునిలిచి ఆసీస్‌ను గెలిపించాడు.

పుణెరి పల్టాన్ జోరు | గుజరాత్‌పై ఘన విజయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టాన్ గెలుపు జోరు కొనసాగుతున్నది. సోమవారం గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో పుణెరి 49-30 తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. పుణెరి జట్టులో ఆకాశ్ షిండే(11 పాయింట్లు) సూపర్-10తో మెరవగా, పంకజ్ మోహిత్(8), మోహిత్ గోయత్(5), అమన్(5), గౌరవ్ ఖత్రి(5) ఆకట్టుకున్నారు. గుజరాత్ జట్టులో గుమన్ సింగ్(13) ఒంటరిపోరాటం గెలిపించలేకపోయింది. ఇప్పటి వరకు పుణెరి ఆడిన 7 మ్యాచ్‌ల్లో ఐదింటిలో గెలువగా, గుజరాత్ ఐదింటిలో నాల్గో ఓటమి ఎదుర్కొంది. మ్యాచ్ విషయానికొస్తే..వరుస విజయాల దూకుడు మీదున్న పుణెరి పల్టాన్ ఆది నుంచే గుజరాత్‌పై విరుచుకుపడింది. ప్రథమార్ధంలోనే పల్టాన్ 21 పాయింట్ల ఆధిక్యం కనబరిచింది. కెప్టెన్ అస్లాం ఇనామ్‌దార్ బరిలో లేకపోయినా.. ఆకాశ్ షిండే, పంకజ్ మోహిత్, మోహిత్ గోయత్ రైడింగ్‌లో కేక పుట్టించారు. మరో పోరులో బెంగళూరు బుల్స్ 36-32తో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది. తొలి ఆరు మ్యాచ్‌ల్లో ఐదింటిలో ఓడిన బెంగళూరు రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. బెంగళూరు జట్టులో అజింక్యా పవార్ (6), అక్షిత్ (6), సురిందర్ పహల్ (5) రాణించారు.

ఏడాదికో మెగా టోర్నీ

ఐసీసీ ఉమెన్స్ ఎఫ్‌టీపీ 2025-29 షెడ్యూల్ విడుదల

మహిళా క్రికెట్‌లోనూ చాంపియన్స్ ట్రోఫీ

దుబాయ్: పురుషులతో సమానంగా మహిళల క్రికెట్‌ను ప్రోత్సహిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మరో కీలక ముందడుగు వేసింది. ఇక నుంచి ప్రతి ఏడాదీ మహిళా క్రికెట్‌లోనూ ఓ భారీ టోర్నీ ఉండేలా ప్రణాళికలు రచించింది. ఈ మేరకు ఐసీసీ సోమవారం ఉమెన్స్ ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీపీ) 2025-2029 షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా రాబోయే ఐదేండ్లలో రెండు వన్డే ప్రపంచకప్పులు (2025, 2029), రెండు టీ20 ప్రపంచకప్పు (2026, 2028)లతో పాటు 2027లో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. 2027 జూన్-జూలైలో ఆరు జట్లతో తొలిసారి జరుగబోయే చాంపియన్స్ ట్రోఫీ (టీ20 ఫార్మాట్‌లో)కి శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ (2028లో) షెడ్యూల్ కూడా ఈ సైకిల్‌లో భాగం కానుంది. కొత్త సైకిల్‌లో మూడు ఫార్మాట్లలోనూ కలిసి 400 మ్యాచ్‌లు జరుగనున్నాయి. భారత్ విషయానికొస్తే ఈ ఐదేండ్ల కాలంలో సొంతగడ్డపై ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, జింబాబ్వేతో సిరీస్‌లు ఆడాల్సి ఉండగా న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఐర్లాండ్ పర్యటనలకు వెళ్లాల్సి ఉంది. కొత్త షెడ్యూల్ నేపథ్యంలో 2026 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) జనవరి నుంచే మొదలుకానుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.